విద్యార్థిని హత్య కేసులో నిందితుడు మృతి

విశాలాంధ్ర - రాంబిల్లి: రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెం విద్యార్థిని దర్శిని హత్య కేసులో నిందితుడు సురేష్ మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. విద్యార్థిని దర్శిని అత్యంత కిరాతకంగా నరికి చంపిన సురేష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు తీవ్రంగా గాలించారు. అయితే నిందితుడి మృతదేహాన్ని అదే గ్రామంలో కుళ్ళిన స్థితిలో గ్రామస్తులు గుర్తించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

సీఎం చంద్రబాబుకు నీరాజనం

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న శాసనసభ స్పీకర్ చింతకాయల

సీఎంకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న డిఐజి విశాల్ గున్ని

హారతితో స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళా నాయకులు

గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

పోలవరం కాలువ అక్విడెట్ పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో దార్లపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు నీరాజనం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి అనకాపల్లి జిల్లాకు రావడంతో వివిధ ప్రాంతాల నుండి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులు పరిశీలించడానికి దార్లపూడి గ్రామానికి ఉదయం 11:30 సమయంలో హెలికాప్టర్‌పై విచ్చేశారు. దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ మురళీకృష్ణ, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్ బాబు, కెఎస్ఎన్ రాజు తదితరులు స్వాగతం పలికారు. అదే సమయంలో మంత్రి అనిత నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను సీఎంకు పరిచయం చేయడం జరిగింది. అనంతరం తన కాన్వాయ్‌లో బస్సుపై ప్రయాణం ప్రారంభించగా దారి పొడవునా మహిళలు పూలతో ఘన స్వాగతం పలికారు. దార్లపూడి జంక్షన్‌లో మండల టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గజమాలతో స్వాగతం పలికారు. అదే సమయంలో పలువురు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఏటికొప్పాక చక్కెర కర్మాగారం వద్ద ఫ్యాక్టరీ సమస్యపై కార్మికులు, రైతులు వినతి పత్రం అందజేశారు. వరాహ నది సమీపంలో ఉన్న పోలవరం ఎడమ కాలువ అక్విడెట్ పరిశీలనకు ముందు జల వనరుల శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలించి అధికారులను పనులు పురోగతిపై ఆరా తీశారు. అనంతరం కాలువ నిర్మాణ పనులను పరిశీలించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, బుద్ధ నాగ జగదీశ్వరరావు, జనసేన సీనియర్ నాయకుడు గెడ్డం బుజ్జి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, మాజీ ఎంపీపీ వై.వినోద్ రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు గుర్రం రామకృష్ణ, ఎస్.వెంకట్రాజు, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, పెద్దిరెడ్డి చిట్టిబాబు, గూటూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు తరలివెళ్లిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: నియోజవకవర్గంలోని ఎస్.రాయవరం మండలం, దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికేందుకు పాయకరావుపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాద్, దేవవరపు రాజబాబు, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, కశింకోట సత్తిబాబు, రాజాన ఆది, వేములపూడి అప్పారావు, సుంకర సూరిబాబు, తలారి రాజా, గొల్లపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి

విశాలాంధ్ర - కే.కోటపాడు: గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయ ఆరోగ్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఎంపీడీవో బీఎస్‌కేఎన్ పట్నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దాలివలస గ్రామంలో గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి, ప్రాథమిక పాఠశా లలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో ప్రతిరోజు మంచినీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ సహాయకులు ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కలిగించాలని ఏఎన్ఎంను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో స్టాక్, చిన్నారుల అటెండన్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ సిబ్బందిని ఆదేశించారు.

ఆర్లే గ్రామంలో పరిశీలన బృందం పర్యటన

విశాలాంధ్ర - కె.కోటపాడు: జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరిశీలన బృందం గురువారం ఆర్లే గ్రామంలో పర్యటించి ఆరోగ్య వైద్య సేవలపై

విచారణ చేపట్టారు. విచారణ బృందం అధికారిణి డాక్టర్ యూసీ కార్తిలియా ఆధ్వర్యంలో బృందం గ్రామంలో ఉన్న గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల రక్తహీనత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా జ్వరాల అదుపునకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులచే వరల్డ్ పాపులేషన్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు డిపిహెచ్ఎన్ఓ డి.నాగమణి, గణాంకాధికారి జనార్దన్, దినేష్ చౌడువాడ ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా కన్నబాబురాజు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - అచ్చుతాపురం: మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) పుట్టినరోజు వేడుకలను వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, కో జెడ్పీటీసీ, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని 33/11 కెవి నరసింగబిల్లి, 33/11కెవి కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్స్ పిఎంఐ వర్క్, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శు క్రవారం ఉదయం 8 గంటలు నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి సబ్‌స్టేషన్, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని నర్సింగ్ బిల్లి, ఎన్‌జి పాలెం, గొబ్బూరు, తాళ్ళపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్త పల్లి, ఏఎస్ పేట, సోమవరం, కన్నూరు పాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోస్సి పేట, ఏనుగుతుని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారు. కె.నాగచైతన్య (నూజివీడు), జి.ఎం.ఎం. సత్యలక్ష్మి (శ్రీకాకుళం), జి.సాయి పవన్ (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం చేసినందుకు గాను ఈదటం, నామవరం ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో కే.స్వప్న తెలిపారు. 16వ విడత సామాజిక తనిఖీలో నామవరం ఫీల్డ్ అసిస్టెంట్ సీతారామస్వామి 5 లక్షల 22 వేల 900 రూపాయలు, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్య 7 లక్షల 6 వేల 75 రూపాయలు బినామీ మస్టర్లతో పనులు చేయకుండా బిల్లులు డ్రా చేశారని తనిఖీల్లో తేలిందన్నారు. డ్వామా పిడి సందీప్ ఆదేశాల మేరకు ఇద్దరిపై పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో స్వప్న తెలిపారు.

ప్రమాదవశాత్తు నేల బావిలో పడి రైతు మృతి

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని పరవాడ పాలెం గ్రామానికి చెందిన కర్రి రాజు (48) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం కూడా పంట పొలానికి వచ్చాడు. ఈ క్రమంలో నేల బావి వద్దకు వచ్చి నీళ్లు తోడుతుండగా కాలు జారి పడిపోయాడు. మృతుడికి ఈత రాకపోవడంతో చనిపోయాడని భార్య పైడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈయనకు వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ఏఎస్ఐ శంకర్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - వి.మాడుగుల: జనసేన టౌన్ అధ్యక్షులు ఇల్లపు రమేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మాడుగుల మండల అధ్యక్షులు గ్రటేటి శివాజీ విచ్చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి కార్యాచరణ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు గురించి ప్రజల యొక్క సమస్యల గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా జనసేన పార్టీ పనిచేస్తుందని, వారందరికీ భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు గండేం రాంబాబు, రౌతు ప్రసాద్, కోడా మహేష్, కలిపి రెడ్డి రాజా, దుక్కా రమణారెడ్డి, దుక్కా నవీన్ రెడ్డి, దొర నగేష్, మైచర్ల రాజు, కాళింగి మధు, జొన్నాడ శ్రీను, కోడా రాజా, బత్తుల ఎల్లారావు, కర్రీ నాగచల్లా, ఆనంద్, బైరా శ్రీను, అందుకూరి ప్రసాద్, కోన లోవ, బమ్మల మణికంఠ, బమ్మల రమేష్, బమ్మల మురళీ, జనసేన వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

పాడిరైతులకు హెరిటేజ్ ఏరువాక బోనస్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పాడిరైతుల అభివృద్ధి కోసం హెరిటేజ్ డెయిరీ కృషి చేస్తుందని మేనేజర్ కూండ్రపు శేష అన్నారు. గురువారం రాజుకోడూరు గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న 30 మంది పాడిరైతులకు ఆయన ఏరువాక బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కూండ్రపు శేష మాట్లాడుతూ డెయిరీ పాలకు అధిక ధర చెల్లిస్తూ, పాడిరైతులకు అండగా ఉంటుం దన్నారు. పాడిరైతులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడిరైతుల పశువులకు రాయితీపై కృత్రిమ గర్భాధారణ రూ.50, కృత్రిమ గర్భాధారణ (ఆడదూడ జన్మించుటకు) రూ.500కు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు గోపి నాయుడు, సత్తిబాబు, గోవింద్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కసింకోట: ఈనెల 27, 28 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. గురువారం జిల్లా కేంద్రంలో గల దొడ్డి రాము నాయుడు భవనంలో ఎస్.ఎఫ్.ఐ అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు గీత కృష్ణ అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్లీనరీ పోస్టరును రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం అవకతవకలపైన వివిధ రూపాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని విద్యార్థులను చైతన్య పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. డ్రగ్స్ మహమ్మారి తరిమికొట్టేందుకు విద్యార్థులు పోరాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యని ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని యూనివర్సిటీలకు నిధులు తగ్గించేస్తున్నారని అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదని వేలాది మంది గ్రామీణ యువత ప్రైవేట్ కాలేజీ వైపు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని అందుకు పోరాడాలని అన్నారు. ఈ జిల్లా ప్లీనరీ సమావేశాలు భవిష్యత్తు విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు దిక్సూచిగా ఉంటాయని ఆయన అన్నారు. నేటికీ పూర్తిస్థాయిలో పుస్తకాల పంపిణీ జరగలేదని ఉపాధ్యాయులు లేక విద్య కుంటు పడుతుందని ఉపాధ్యాయ పోస్టులు భర్తీ తక్షణమే చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రమణ, కే.ఆదికేశవ, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో స్థానం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లా కేంద్రంలో గల మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పైల మౌళి, ఇంద్ర ఆకాష్ లు ప్రతిష్టాత్మకమైన ఐఐఐటిలో స్థానం సంపాదించారు. పైలమౌళికి శ్రీకాకుళం క్యాంపస్లో, ఇంద్ర ఆకాష్‌కు ఒంగోలు క్యాంపస్లో ప్రవేశం లభించిందని, ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో కూడా ఈ ఇరువురు అత్యధిక మార్కులతో సత్తా చాటారని, పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రీ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినప్పుడే తల్లిదండ్రులు నిజమైన ఆనందాన్ని పొందుతారని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులు కూడా బాగా చదవాలి అని చెప్పారు. పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక అవడం గర్వించదగిన విషయమని చెప్పారు. హిందీ అధ్యాపకుడు మహేంద్ర నాథ్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రతిభా అవార్డుతో సత్కరిస్తారని, నూతన ప్రభుత్వం పారిశ్రామిక రంగం అభివృద్ధిపై దృష్టి పెడుతు న్నందున ప్రతిభ కలిగిన విద్యార్థులకు అత్యధిక జీతంతో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. గురుకుల పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఇరువురు విద్యార్థులను అభినందించారు.

జర్నలిస్టుల సమస్యలపై చంద్రబాబుకు వినతి

విశాలాంధ్ర - యస్.రాయవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాయక రావుపేట నియోజకవర్గ పర్యటన భాగంగా దార్లపూడి వచ్చిన చంద్రబాబు ను ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడచంద్రరావు నాయకత్వంలో పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నాయకులు కుందూరి రాణి, లోవరాజు, వెలగ లోవరాజు, బివివి సత్యనారాయణ, విష్ణు ,ప్రగడ రమేష్‌లతోపాటు పలువురు పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని, గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న గిరిజన యాత్రలకు మైదాన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హత కలిగిన వారికి అక్రిడేషన్ మంజూరు చేయాలని ఆ వినతిపత్రంలో ముఖ్యమంత్రికి వివరించారు. పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ,అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌లు ఉన్నారు.